# యోజనగంధి



యమునానది ప్రశాంతంగా ప్రవహిస్తోంది. మధ్యాహ్నం దాటి కొద్ది గడియలయ్యాయి. సూర్యతాపం ఎక్కువగా ఉండటంతో జన సంచారం తక్కువగా ఉంది. కొందరు మధ్యాహ్నపు ఎండ వేడిమికి సేదదీర్చుకుంటున్నారు.

నది దాటేందుకు ఎవరైనా వస్తారేమో నని ఎదురు చూస్తోంది సత్యవతి.

నది ఒడ్డున చెట్టుకింద నావని ఆపింది. యౌవనవతి అయిన సత్యవతి చెట్టుదగ్గర నించుంటే ప్రకృతి దేవతలా కనిపిస్తోంది ఆ నిముషం. దూరాన్నుంచి వస్తున్న ప్రయాణికుణ్ణి గమనించి గబగబా దగ్గరికొచ్చి నిల్చుంది. మీసాలు, గడ్డాలతో ఉన్న వ్యక్తిని చూస్తూ 'ఈ సన్యాసా తన ఓడ ఎక్కేది!' అనుకుంది పరీక్షగా అతన్నిచూస్తూ. కానీ అతని నడకలో గంభీరత, చూపుల్లో తీక్ష్ణత, ముఖంలో వర్చస్సు స్పష్టంగా కనిపిస్తున్నాయి. భార్యమీద అలిగి ఇల్లు వదిలి వచ్చేస్తున్నాడేమో! సత్యవతి ఆ దగ్గరవుతున్న వ్యక్తిని మరీ మరీ గమనించడం మొదలుపెట్టింది. ఏ యువరాజో, చక్రవర్తో మునివేషం వేసుకున్నాడు. అంతే!

నిండైన వక్షోజాలపై అచ్ఛాదనంగా నిలిచిన ఏక వస్త్రాన్ని సరిచేసుకుని, వినయంగా ముఖంలోకి చూసింది సత్యవతి.

"నువ్వు ఒంటరిగా పడవ నడుపుతావా" - నఖశిఖ పర్యంతరం పరిశీలిస్తూ ప్రశ్నించాడు ఆయన.

"చిన్నప్పటినుంచి నీళ్ళలో పెరిగినదాన్ని, ఒక్కతినే పడవ నడపగలను. మీకేం భయం లేదు. రండి" నవ్వుతూ అంది దాశకన్య సత్యవతి.

మల్లెమొగ్గలా ఉన్న పలువరుస ఒక్కసారి మెరిసింది. తీర్చిదిద్దిన ఆమె నాసిక, ఎర్రని పెదాలు, బిగువైన వక్షోజాలు, నునుపైన బాహువులు వరుసగా, ముని చూస్తుంటే ఆమె కళ్ళు అటూఇటూ కదలిస్తూ మీనాక్షిలాగే ఉంది ఆ క్షణం. విశ్వకర్మకూడా ఇంతటి సుందరమైన మూర్తిని సృష్టించచలేడే! బ్రహ్మదేవుడు ఇంత అందమైన కన్యని ఎట్లా సృష్టించాడో-మహర్షి ఆమెను పరీక్షగా చూస్తూనే ఉన్నాడు.

జీవనాధారం కోసం పడవ నడుపుకునే ఈ పల్లెపిల్ల తనను మదనవివశుణ్ణి చేస్తోందేమిటి? దుష్ట శక్తుల్ని జయించి కాంతాకనకాలకు అతీతుడైన తను ఇంద్రియ నిగ్రహం కోల్పోతున్నాడేమిటి? దివ్యజ్ఞానంతో ఆమెకు సంబంధించిన భూత భవిష్యత్తులను ఆలోకనం చేశాడు. ఆమె దాసకన్య కాదు - వసురాజర్షి కుమార్తె. ఆమె వంక చిరునవ్వుతో చూశాడు మహర్షి. ఆమెకు అతని కామ ప్రవృత్తి భయాన్ని కలిగించింది. అతని సౌందర్యం ఆమెను ప్రలోభ పరుస్తోంది. అతని శరీరదారుఢ్యం, వర్చస్సు ఆమెకు ఆనందాశ్చర్యాలను కలిగిస్తున్నాయి. ఆ మహర్షి బాహువుల్లో తన జన్మ ధన్యమయితే? కనురెప్పలు పైకెత్తి ఓరగా చూసింది. 'అమ్మో! స్త్రీకి కన్యాత్వం పోతే ఇంకేమున్నట్టు? మరో వ్యక్తిని వివాహమాడే అర్హతే పోగొట్టుకున్నట్టు. తండ్రి దాశరాజు తనని పెంచి పెద్ద చేశాడు. విద్యాబుద్ధులు నేర్పాడు. తనే అతని ప్రాణం అనుకుంటున్నాడు. తను పొరబాటు చేస్తే ఆ అపకీర్తితో బతకగలడా? తనమీద విశ్వాసంతో, ప్రేమతో ఉన్న వ్యక్తి బాధపడేట్లు తను క్షణభంగురమైన సుఖాన్ని కోరటం ఎంత నేరం!' ఆమె చూపులు మహర్షిపైనే ఉన్నాయి.

అవధులులేని కామంతో తనను సమీపిస్తున్న మహర్షిని చూసింది. తన ఆకర్షణను చంపుకుని, తన కోరికని తోసిపుచ్చి, తన సుఖాన్ని త్యాగంచేసి- నిరా

కరిస్తే ఈ మహర్షి శపిస్తే తనేమవుతుంది? తను సత్యవతి...తన మనసులోని ఆలోచన ఆ మహానుభావుడికి చెప్పి అతని ప్రయత్నాన్ని వారించాలి-అనుకుంది.

"మహర్షీ! నేను దాశకన్యను. చేపలలో పుట్టి చేపలలో పెరిగినదాన్ని. మత్స్యగంధిని. మిమ్మల్ని స్పృశించే అర్హత లేనిదాన్ని" అంది వినయంగా.

మహర్షి చిరునవ్వు నవ్వాడు.

"అదా, బహుస్వల్ప విషయం! నీవు మత్స్యగంధివి కావిక. నీ శరీరం నుంచి యోజనం దూరం పరిమళాలు వెదజల్లేలా చేస్తాను. చూడు. నువిప్పుడు యోజనగంధివి."

సత్యవతి విస్తుపోయింది. సుగంధం శరీర మంతటా, ఆ ప్రాంతమంతటా వ్యాపించింది.

మహర్షి హస్తం ఆమె భుజంమీద వేశాడు.

"నా మనవి ఆలకించండి మహర్షీ! నా కన్యాత్వం చెడితే నా బతుకు నిరర్థకం. నాకూ, నా వంశానికి శాశ్వత కళంకం."

మహర్షి మళ్ళీ నవ్వాడు.

"అదీ బహుస్వల్ప విషయమే! నీ కన్యాత్వం చెడకుండా నీకు వరమిస్తున్నాను. నీకు కళంకం రాకుండా కాపాడుతాను."

సత్యవతి మరీ ఆశ్చర్యంగా అతన్ని చూసింది. అదెట్లా సాధ్యమో తెలియటంలేదు. ఈ మహర్షికి అసాధ్యమన్నది లేదేమో! సిగ్గుగా తలవంచుకుంది. సర్వాలంకార భూషిత అయిన యోజనగంధి, నావను వేగంగా నడిపి యమునా నదీ ద్వీపం దగ్గరకు చేర్చింది.

మహర్షి ఆమెను హృదయానికి హత్తుకుంటుంటే-"స్వామీ! ఇది పట్టపగలు. ఇది పడవ...!" మాటలు తడబడ్డాయి ఆమెకి. మహర్షి కౌగిలిలో ఒదిగిపోతూనే దట్టమైన చీకటి నలుమూలలా అల్లుకోవడం గమనించింది. ఆ చీకట్లో సత్యవతి కళ్ళు మిలమిల మెరిశాయి. మహర్షిని అపారమైన గౌరవంతో, భక్తితో, కోరికతో పెనవేసుకుని, ఆనందోద్వేగాలతో తన్మయురాలైంది యోజనగంధి.

చీకటిరేఖలు తొలగిపోయాయి. తన ప్రణయానుభవం స్మరించుకుంటూ పాదాలమీదపడిన సత్యవతిని లేవనెత్తాడు పరాశర మహర్షి.

"కన్యాత్వం చెడకుండా సద్యోగర్భం దాల్చి సుపుత్ర జనని వవుతావు." మహర్షి సత్యవతి శిరసు నిమిరాడు.

తన శరీరంనుంచి అనంతమైన శక్తి ఏదో బయటికొస్తున్న భావనతో తత్తరపాటు చెందుతున్న సత్యవతికి సక్షాత్కరించాడు - సహస్రసూర్యతేజోరాశి కృష్ణద్వైపాయనుడు. చూస్తుండగానే ఆ తేజోపుంజం ఆమె పాదాలమీద తల అన్చి-

"తల్లీ! పరాశర మహర్షికీ, నీకూ కలిగిన పుత్రుణ్ణి. నా తండ్రి ఇచ్చిన వరాలు ఆధారంగా, నీకు ఎలాటి ఆపదా రాకుండా కాపాడతాను. పని కలిగి నువ్వు పిలిచినప్పుడు పలుకుతాను" అంటూ చేతులు జోడించాడు. లోకకల్యాణార్థం తపోవనానికి బయలుదేరాడు వ్యాసమహర్షి, మహాభారత కర్త!

యమునానది ఒడ్డున పడవలోంచి దిగి యౌవనభారంతో దాశరాజు గృహంవైపు వయ్యారంగా అడుగులేసింది యోజనగంధి సత్యవతి. *

(ఆధారం : కవిత్రయంవారి శ్రీమదాంధ్ర మహాభారతం :
ఆదిపర్వం : తృతీయాశ్వాసం)

(ప్రచురణ : ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక : 19-8-1987)